క్లుప్తంగా

స్టూడెంట్ డైరీల వితరణ



డైరీలను చూపుతున్న విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 400 మంది విద్యార్థులకు డైరీలను(స్టూడెంట్) సంస్కృతం ఉపాధ్యాయుడు ఎం.వి.ఎ.జి.కృష్ణకుమార్ బుధవారం వితరణ చేశారు. స్కూల్ పరిశీలనకు వచ్చిన డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి డైరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ ఈ డైరీలు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఉపాధ్యాయులకు తరగతుల నిర్వహణ పాఠ్యాంశాల బోధన గురించి పలు సూచనలు చేశారు. హెచ్ఎం పైడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అవలింగిలో దాహం కేకలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

సారవకోట: మండలంలోని అవలింగి ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇక్కడున్న సుమారు 25 కుటుంబాలకు ఒకే బోరు ఉండటం, ఆ బోరు అంతంత మాత్రంగానే పనిచేస్తోంది. వీళ్లంతా సమీపంలోని శ్మశానంలో ఉన్న మంచినీటి బోరు నుంచి నీరు తీసుకువచ్చి వినియోగిస్తున్నారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు మూడు నెలల క్రితం అమర్చారే తప్ప.. ఒక్క చుక్క నీరు కూడా సరఫరా జరగడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. బోరు బాగు చేయాలని వేడుకుంటున్నారు.

వసతి గృహాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఆమదాలవలస: పట్టణంలో బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలను వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముత్తా విజయ్ కుమార్, పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పరిశీలన చేసినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలు, వసతులు, వివిధ అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు మెట్ట కృష్ణ, హేమంత్, శశి, మూకళ్ల విజయ్, అఖిల్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం

జలుమూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని చల్లవానిపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.నిర్మలాదేవి అన్నారు. బుధవారం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆనెం యోగి పాఠశాల అభివృద్ధికి రూ.పది వేలు అందించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటు.. పాడికి చేటు

- అనారోగ్యం పాలవుతున్న పాడి పశువులు
- అవగాహన లేకపోతే పశుసంపదకు తీవ్రనష్టం



బూరగాం వద్ద ఒకేచోట ఉన్న ఆవులు



ప్రహరాజపాలెంలో రెకుల షెడ్‌లో ఉన్న ఆవులు

పాతపట్నం:

దోమల కారణంగా పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. ఈ పరిస్థితిని ముందుగానే అధిగమిస్తే మూగ జీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల పాడి పశువులు రోగాల బారినపడితే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కోసారి పశువులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. పాతపట్నం నియోజకవర్గంలో పాడి సంపదకు కొదవలేదు. 67,898 పైగా ఆవులు, గేదెలున్నాయి. ప్రస్తుత సీజన్‌లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పాడిపశువులు గొంతు వ్యాపు, దొమ్ము, గాలికుంటు తదితర వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి సరైన చికిత్స అందివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రంగా ఉంచాలి..



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మేత, దాణాకు అందించే పాత్రలు శుభ్రం చేయాలి. వైద్యుల సలహా మేరకు ఎప్పటికప్పుడు అవసరమైన టీకాలు, మందులు అందించాలి. దోమకాటు వలన ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయి. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– మంచు కరుణాకరరావు,
పశుసంవర్థకశాఖ ఏడీ, పాతపట్నం

దోమకాటుతో వచ్చే సమస్యలు..

- పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో అవి మేత సరిగా తీసుకోవు. ఆకలి మందగించటం జరుగుతుంది. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గిపోతుంది.
- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజురోజుకూ బలహీనపడుతుంది.
- దోమలు కుట్టిన చోట దురద వచ్చి పుండ్లు పడతాయి.
- పశువులకు మేత ప్రాంతం అంతా శుభ్రంగా లేకుంటే దోమలు చేరుతాయి. పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోలేవు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్‌లో కట్టేసిన తరువాత దోమ తెరలు వాడటం శ్రేయస్కరం. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టే ముందు వేప ఆకులు, సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల శాలల చుట్టూ వ్యర్థాలు, పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసుకోవడంతోపాటు చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

పాతపట్నం నియోజకవర్గంలో పాడి సంపద వివరాలు ఇలా..

మండలం	పాతపట్నం	మెళియాపుట్టి	కొత్తూరు	హిరమండలం	ఎల్.ఎన్.పేట
ఆవులు	14,133	17,297	19,502	7,599	6,078
గేదెలు	1,177	297	1,032	474	309

అధిక యూరియాతో అనర్థం



మాట్లాడుతున్న ఏడీ వెంకట మధు

నరసన్నపేట: రైతులు వరి పంటలో అధికంగా యూరియా వాడుతున్నారని, దీనివలన భూమి సారాన్ని కోల్పోతుందని, తెగుళ్లు, పురుగులు వరి పంటలపై ఆశించే ప్రమాదం ఉందని నరసన్నపేట ఏడీ ఎల్. వెంకట మధు అన్నారు. మండలంలోని మడపాం గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాష్ యోజన పథకంలో భాగంగా బుధవారం అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. వరి పంటకు శాస్త్రవేత్తల సూచనల మేరకే యూరియా వినియోగించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 60 నుంచి 75 కేజీల యూరియా సరిపోతుందన్నారు. దమ్ములో డీఏపీ వేస్తే.. 60 కేజీలు కంటే తక్కువ యూరియా వేయాలన్నారు. నాట్లు వేసిన 20 రోజుల్లోగా 20 కేజీలు, నెల తరువాత 20 కేజీలు, పొట్ట దశలో 20 కేజీల యూరియా వేస్తే సరిపోతుందన్నారు. పొటాష్ రెండు సార్లు వేయాలన్నారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి వరిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. శాస్త్రవేత్త ఎస్.కిరణ్ కుమార్, జిల్లా వనరుల కేంద్రం ఏఓ వై.సురేష్, మండల వ్యవసాయాధికారి వై.సూర్య కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



లింగాల రవిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మామిడి శ్రీకాంత్, నాయకులు

పాతపట్నం: మండల కేంద్రంలోని కాపువీధికి చెందిన పాతపట్నం మార్కెట్ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ లింగాల జనార్దనరావు కుమారుడు లింగాల రవిబాబు ఇటీవల మృతి చెందారు. రవిబాబు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ బుధవారం పరామర్శించారు. మండలంలోని పెద్దలోగిడి గ్రామానికి చెందిన కాసీన అన్నపూర్ణమ్మ, చిన్నలోగిడి గ్రామానికి చెందిన కోన అన్నపూర్ణ, బూరగాంలో గడియా మోహన్‌రావు కుటుంబ సభ్యురాలు సావిత్రమ్మ, బృందా పరోడా భార్య చొచ్చులా పరోడా ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను మామిడి శ్రీకాంత్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, పార్టీ నాయకులు కొండాల అర్జునరావు, కనకాల కన్నన్న, చంద్రరావు, నాగరాజు, సలాన చిరంజీవి, చీకటి పద్మరాజు, మజ్జి నారాయణ, ఎన్ని తిరుపతి, ప్రహ్లాద్ పుల్లాయ్, దకర చిన్నారావు ఉన్నారు. పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు

కార్డెన్ సెర్చ్..

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ, జగనన్న కాలనీ, తిమ్మాపురం ప్రాంతాల్లో ఎస్ఐ సనపల బాలరాజు ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటికీ వెళ్లి వాహనాలను పరిశీలించారు. వ్యక్తుల వివరాలు, అనుమానాస్పద కదలికలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలరాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు కలిగి ఉన్నా.. విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే తెలియజేయాలన్నారు. ఎస్ఐ-2 సీపాన కాంతారావు, పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్డి శాంతి



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో గల క్యాంప్ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పరిస్థితులను వివరించారు.

– హిరమండలం

సుపరిపాలనకు దూరం..

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి దూరంగా ఉన్నామని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు సోనాపురం గంగాధర్ (మాజీ యూనిట్ ఇన్‌చార్జి), జొన్న భాగ్యం తెలిపారు. కొసమాలలో వీరు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కష్టాల్లో ఉన్నప్పుడు పనిచేశామని, నేడు తమకు విలువ లేకుండా చేస్తున్నారన్నారు. పార్టీలో విద్యావంతులకు చోటులేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు అంకడాల వేణుగోపాలరావు, మహిళా నాయకురాలు జొన్న భాగ్యం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు చినబాబుతోపాటు 20 మంది కార్యకర్తలు కొసమాలలో జరిగిన కార్యక్రమానికి గైర్హాజరయ్యారని తెలిపారు. ఇదే ధోరణి కొనసాగిస్తే పార్టీకి రాజీనామా చేస్తామన్నారు.

నేత్ర వైద్య శిబిరం రేపు

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు వచ్చి ఉచితంగా తనిఖీలు నిర్వహిస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు, హెల్త్ కార్డు ఉన్న ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘ సభ్యులందరూ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

పీ4 లక్ష్యాలను పూర్తిచేయాలి

పొందూరు: పీ4 లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆమదాలవలస నియోజకవర్గం ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ డీడీ వై.సత్యనారాయణ అన్నారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీ4 విధానంపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పొందూరు మండలంలో 2549 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. సుమారు 890 మంది మార్గదర్శకులను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. మండల ప్రత్యేకాధికారి రఘునాథ్, ఎంపీడీఓ మీసాల మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

అభినందన..

హిరమండలం: మండలంలోని కల్లట పంచాయతీ జిల్లోడిపేట గ్రామానికి చెందిన కొర్ను వంశీకృష్ణ ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ 12,392 సాధించారు. రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారిశెల్లి రామరాజు ఆధ్వర్యంలో బుధవారం వంశీకృష్ణను సత్కరించారు. కల్లట ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఎంఈఓ కె.రాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి తల్లిదండ్రులను, గురువు పి.చిన్నారావును సన్మానించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓట్లన్నీ ఒకేచోట ఉండాలి

పాతపట్నం: ఓటర్ల జాబితాలో తప్పు, ఒప్పులను సరిచూసుకోవాలని తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఒకే కుటుంబంలోని ఓటర్లను ఒకేచోట ఉండేలా చూడాలని, ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లను తొలగించాలన్నారు. ఎలక్షన్ డీటీ నారాయణరావు, నాయకులు ఎనుగుతల సూర్యం, చింతాడ త్రినాథరావు, మజ్జి తిరుపతిరావు, బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎరువులు అందించాలి

మెళియాపుట్టి: మండలంలోని కొత్తూరు పంచాయతీ గిరిజన రైతులకు ఎరువులు అందలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు అన్నారు. బుధవారం కొత్తూరులో విలేకర్లతో మాట్లాడారు. గిరిజన రైతులకు ఇంతవరకు ఎరువులు అందించకపోవడం సమంజసం కాదన్నారు. గిరిజనులు వారి సమస్యను ఎవరికి తెలియజేయాలని ప్రశ్నించారు. వెంటనే వారికి ఎరువులు పంపిణీ చేయాలన్నారు. సీయాకు రాజారావు, షేషగిరి, బాబూరావు, తెంబూరు రవి తదితరులు ఉన్నారు.

యూరియా పంపిణీ

నరసన్నపేట: మండలంలోని సత్యవరం రైతు సేవా కేంద్రంలో రైతులకు 400 బస్తాల యూరియాను ఎంపీపీ ఆరంగి మురళి బుధవారం పంపిణీ చేశారు. ఎరువుల కొరత ఉందన్నారు. రైతులకు యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు సకాలంలో అందివ్వాలని అధికారులను కోరారు. ప్రస్తుతం అరకొరగా యూరియా అందడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. నరసన్నపేటకు చెందిన వార్డు సభ్యులు నీలం, లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం కోవిలాంలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: పిండ్రువాడలో క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: గురండిలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



సారవకోట: కె.జె.పురంలో క్యూ ఆర్ కోడ్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

‘మోసం చంద్రబాబు నైజం’



ఆమదాలవలస: గాజులకొల్లివలసలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు అన్నారు. ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీలో, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పార్టీ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మొండేటి కూర్మారావు, పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. ఎల్.ఎన్.పేట మండలంలోని కోవిలాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో, హిరమండలం మండలంలోని బగిరథిపురం, పిండ్రువాడ, కిట్టాలపాడు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ నాయకులు ఆధ్వర్యంలో, కొత్తూరు మండలంలోని ఉప్పరపేట, గురండి, ఆర్‌కేపురం, సోమరాజపురం గ్రామాల్లో ఎంపీపీ సవర సావిత్రి, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో, మెళియాపుట్టి మండలంలోని కొత్తూరులో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించి కూటమి పాలన మోసాలను వివరించారు. నరసన్నపేట మండలంలోని కంబకాయ, మడపాం గ్రామాల్లో ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో, సారవకోట మండలంలోని కె.జె.పురం, రామకృష్ణాపురం, మదనాపురం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని అల్లాడ, అల్లాడపేట, సైరిగాం గ్రామాల్లో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, పార్టీ జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు ఆధ్వర్యంలో, పోలాకి మండలంలోని చీడివలస, జడూరు, పిరువాడ పంచాయతీల్లో పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసనాలను తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: కొత్తూరులో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



నరసన్నపేట: ఉర్లాంలో క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తున్న నాయకులు



జలుమూరు: అల్లాడలో క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



పోలాకి: పిరువాడలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు